ప్రజాశక్తి

ఆదివారం 19 ఫిబ్రవరి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పింఛన్‌దారులకు
దొరకని పరిష్కారం



- కరెంటు బిల్లుల లింకుతో వృద్ధులకు అన్యాయం
- రేషన్‌కార్డు నుంచి విడిపోయే అవకాశం లేక అగచాట్లు
- బాధితులు 15 వేల మందికి పైనే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వృద్ధులు లేదా తల్లిదండ్రులు ఎక్కువ శాతం పిల్లల రేషన్‌కార్డుల్లో ఉంటారు. ఒకవేళ అందరూ ఉన్నా పిల్లలు పెద్దయ్యాక ప్రత్యేకంగా రేషన్‌కార్డులు తీసుకునే సమయంలోనూ తల్లిలేదా తండ్రిని వారి కార్డుల్లోనే కలిపి రేషన్ కార్డులు తీసుకున్నారు. ఇదే ఇప్పుడు సమస్యగా మారింది. వృద్ధులకు ఇచ్చే పింఛన్‌కు కరెంటు బిల్లులు లేదా ఐటి అనుసంధానం చేయడంతో వృద్ధులకు పింఛన్లు పోయాయి. ఆరు నెలలుగా ఇదే తంతు కొనసాగుతోంది. జిల్లాలో ఇప్పటికే ఈ లింకుతో 15 వేల మందికి పైగా పింఛన్లు పోయాయి. వీటికి ఇప్పటికీ పరిష్కారం దొరకడం లేదు. చాలామంది కరెంటు ఆఫీసులకు పోయి బిల్లులు సవరించుకున్నారు. కొందరు పేర్లు తొలగించుకునే యత్నం చేశారు. అయితే రేషన్‌కార్డు నుంచి సింగిల్‌గా ఉన్న వృద్ధులను తీసేసే ఆప్షన్ ఇంకా ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అదే విధంగా వృద్ధులు ఒక్కరే ఉన్నా వారికి రేషన్‌కార్డు ఇవ్వాలన్నా కుదరదు. నిబంధనలు అలా ఉన్నాయి. దీంతో పరిష్కారం దొరక్క అవస్థలు పడుతున్నారు. రేషన్‌కార్డు నుంచి తొలగించుకునే ఆప్షన్ కూడా రాలేదు. కొందరు సివిల్ సప్లయి ఆఫీసుకు పోయి తప్పించుకునే యత్నం చేసుకుంటున్నారు. ఇలా తొలగించినా మళ్లీ కొత్త కార్డు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లపై తీసుకున్న నిర్ణయం ఆందోళనగా ఉంది. కొత్తగా పింఛన్లు ఇస్తున్నామని చెబుతున్నా అదే స్థాయిలో పాతవారికి తప్పించారు. వృద్ధులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అనేక మందికి ▶ 2లో

ధాన్యం కొనుగోళ్లు
అంతంత మాత్రమే..

- కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లింపుల్లో జాప్యం
- కల్లాల్లోనే వ్యాపారులకు తెగనమ్ముకుంటున్న రైతులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో సుమారుగా 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు ఉత్పత్తి చేస్తున్నారు. ఇందులో ప్రజా అవసరాలను మినహాయించి ప్రాథమికంగా 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధపడింది. ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన రైతులకు మద్దతు ధర కల్పించడమే ధ్యేయంగా ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో 79 మిల్లులు ద్వారా, 153 రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఈ మేరకు డిసెంబరు నెల రెండోవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు.

సాధారణ రకం క్వింటా ధాన్యం ధర రూ.2,040గా, గ్రేడ్-ఏ రకం ధాన్యం క్వింటా ధర రూ.2,060గా ప్రకటించారు. ఆరుగాలం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి ఆర్థిక చేయూత నివ్వడమే ప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. ఈ మేరకు ఖరీఫ్‌లో వరి సాగు చేసిన వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజక వర్గాల పరిధిలోని రైతులు రైతుభరోసా కేంద్రాల ద్వారా తమ ధాన్యం అమ్మకాలు జరిపారు. ఇప్పటి వరకు సుమారు 60 మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకాలు మాత్రమే ఆర్‌బికేల ద్వారా జరిగాయి. ఇలా అమ్మకాలు జరిపిన రైతుల్లో కొందరికి జనవరి 8 వరకు, మరికొందరికి 15వ తేదీ వరకు మాత్రమే ధాన్యం అమ్మకాల నగదు వారి ఖాతాల్లో జమయ్యాయి. ఇంకా రూ.75 కోట్ల మేర ధాన్యం అమ్మకాల తాలూకు నగదు రైతులకు ప్రభుత్వం నుంచి రావలసి ఉంది. ధాన్యం నూర్పిడి నుంచి వాటి అమ్మకాల వరకు ఆర్‌బికేల చుట్టూ తిరిగిన రైతులు ఈ తరువాత నగదు కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం ఎంత గొప్పగా రైతులకు తాము మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఇందుకు పెట్టిన నియమ నిబంధనలు, షరతుల కారణంగా రైతులు తమ పంటను కల్లాల్లోనే తెగ నమ్ముకున్నారు. 75 కిలోల బస్తాకు ఆర్‌బికేల్లో రూ.1,550 ధర ఉన్నా రైతులకు దళారులకు రూ.1300కే తెగ నమ్ముకున్నారు. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన కొనుగోళ్ల టార్గెట్‌లో 10 శాతం అమ్మకాలు కూడా ఆర్‌బికేల ద్వారా జరుతున్న పరిస్థితి లేదు. ఈ ధాన్యం కొనుగోలులో కూడా నగదు చెల్లింపుల జాప్యం వలన మిగిలిన రైతులు నేరుగా ప్రైవేట్ వ్యాపారులకే తమ ధాన్యం తక్కువ ధరకే అమ్ముకుంటున్న పరిస్థితి ఉంది.



యంత్రాలతో జోరుగా వరి కోతలు

కొనుగోలు కేంద్రాల ఊసేదీ?

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి అలా ఉంటే అసలు రబీలో సాగయిన ▶ 2లో

మిర్చి రైతుకు
నష్టాల మంట



- క్వింటా రూ.30 వేల నుంచి రూ.15 వేలకు పతనం
- ధర తగ్గడంతో రైతు దిగాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మిరప పంట సాగు చేసేటప్పుడు ఉన్న ధరలు దిగుబడులు చేతికొచ్చే సరికి పతనం కావడంతో మిరప రైతుకు కష్టాలు తప్పడం లేదు. మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. పంటను తెగుళ్లు చుట్టుముట్టాయి. కాపాడుకునేందుకు విపరీతంగా మందులు. పిచికారీ చేశారు. తీరా దిగుబడులు చేతి కొచ్చే సమయానికి ధర పతనమవడంతో ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.15 వేలకు పడిపోయింది..

ఈ ఏడాది సాధారణం కంటే అధిక విస్తీర్ణంలో మిరప సాగు చేశారు. యర్రగొండ పాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో 23,800 ఎకరాల్లో మిరప తోటలు వేశారు. గతేడాది క్వింటా రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయించారు. దిగుబడులను గోదాములో నిల్వ చేసుకున్న వారు క్వింటా రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు అమ్మేశారు. ధర అధికంగా ఉండటంతో ఈ ఏడాది సాగు పెంచారు. సాధారణంగా జులై ,ఆగస్టు నెలల్లోనే మిరప సాగు చేస్తారు. ధర బాగుండటంతో మొక్కజొన్న, పత్తి పంట కోతల తర్వాత నవంబరులోనూ సాగు చేశారు.ఆ పంట చేతి కొచ్చేసరికి ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. దిగుబడులు వచ్చిన ప్రారంభంలో క్వింటాకు రూ.25 వేల ధర పలికింది. తెగుళ్ల వల్ల మొదటి కోతలో కాయలు నాణ్యత లేకపోవడంతో గిట్టుబాటు ధర రాలేదు. తాలుకాయ అధికంగా రావడంతో క్వింటా రూ.10 వేలకే విక్రయించాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. రెండో కోత సమయానికి ధరలు భారీగా తగ్గాయి. ప్రస్తుతం క్వింటా మిరప కాయలు ధర రూ. 15 వేల నుంచి రూ.17 వేలు పలుకుతోంది.

ఎకరాకు లక్షన్నర పెట్టుబడి..

ధరలు అధికంగా ఉండటంతో పెట్టుబడులకు వెనుకాడకుండా సాగు చేశారు. ఈ ఏడాది తెగుళ్లు అధికంగా సోకాయి. నల్ల తామర, జెమినీ వైరస్ చుట్టుముట్టాయి. దీంతో పంటను కాపాడుకునేందుకు రైతులు అధికంగా మందులు పిచికారీ చేశారు. మూడు రోజులకు ఒకసారి మందులు పిచికారీ ▶ 2లో



టంగుటూరు మండలం, జమ్ములపాలెంలో..

శైవక్షేత్రాలు కిటకిట

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు

▶ 5లో



కనిగిరిలో కళ్లకు గంతలతో, చేతికి సంకెళ్లతో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

విధ్వంసాలు సృష్టిస్తున్న వైసిపి ప్రభుత్వం

చంద్రబాబు కాన్వాయ్ అడ్డగింతకు వ్యతిరేకంగా నిరసనలు

▶ 5లో

మున్సిపాలిటీ రహదారి మూసుకుపోతోంది!

రహదారుల ఆక్రమణలపై దృష్టి సారించని అధికారులు ● ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలోని రహదారులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఆక్రమణలపై పాలకులు, అధికారులు పట్టించుకోక పోవడంతో ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి కూడా మూసుకుపోయింది. ఆ రహదారిలో వాహనం ఎదురు పడిందంటే అరగంట పాటు ట్రాఫిక్ నిలిచిపోవాల్సిందే. రెండు వాహనాలు వెళ్లేందుకు విశాలమై 30 అడుగుల రహదారి ఆక్రమణల ఫలితంగా 15 అడుగులకు కుచించుకుపోయింది. ఆక్రమణలు తొలగించకుండా నిర్మించిన దివంగత 'అచ్యుత రామశేషయ్య కూరగాయల మార్కెట్' ముఖద్వారం నిర్మించడం ఆక్రమణలకు ఊతమిచ్చింది. మున్సిపల్ కార్యాలయంతో పాటు పంచాయతీరాజ్ కార్యాలయం, దివంగత కందుల ఓబులరెడ్డి అతిథి గృహం (పిఆర్ గెస్ట్‌హౌస్)తో పాటు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉంది. ఆ ఒక్క పాఠశాలలో 1200 మంది విద్యార్థులు ఇదే మార్గంలో ఉదయం, సాయంత్రం బడి వేళల్లో వెళ్లాల్సి ఉంది. మున్సిపల్ కార్యాలయంతో పాటు కూరగాయల మార్కెట్ కూడా అక్కడే ఉంది. కూరగాయల లోడుతో వచ్చే వాహనాలు అధికంగా ఉంటాయి. వీటితో పాటు అది వ్యాపార కేంద్రం. రహదారికి ఇరువైపులా దుకాణాల యజమానులు తమతమ వస్తువులను ప్రజలకు కనిపించాలనే ఉద్దేశంతో రోడ్డుపైకి ప్రదర్శనగా ఉంచుతున్నారు. సాయి బాలాజీ సినిమా థియేటర్‌తో పాటు సగం పట్టణ జనాభా అదే మార్గంలో విజయా టాకీస్ ప్రాంతం వరకు రాకపోకలు ఇదే మార్గంలో కొనసాగాలి. ఇంతటి రద్దీగా ఉండే మార్గం ఆక్రమణలతో కుచించుకుపోతున్నా కూత వేటు దూరంలో ఉన్న మున్సిపల్ అధికారులు దృష్టి సారించడం లేదు. విచిత్రం ఏమిటంటే మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధుల వాహనాలు సైతం ఇదే మార్గంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో సతమమతమవుతున్నారు. పాలకులు, అధికారులు మూసుకుపోతున్న మున్సిపాలిటీ రహదారినైనా ఆక్రమణల చెర నుంచి కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.






మున్సిపల్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయ ప్రధాన రహదారి, వాహనాలు ఎదురు పడితే ఇలా నిలవాల్సిందే..



దుకాణాల ముందు ఉంచిన వస్తువులు

అటవీశాఖ అధికారులకు తుపాకులు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నాగార్జున సాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలోని అటవీ అధికారులకు డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావు చేతుల మీదుగా శనివారం తుపాకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావు మాట్లాడుతూ గతంలో అటవీ శాఖకు తుపాకులు ఉండేవని చెప్పారు. అయితే ఆ తర్వాత కాలంలో అటవీ శాఖ అధికారుల నుంచి ప్రభుత్వం తుపాకులను వెనుకకు తీసుకుందని చెప్పారు. కాగా అభయారణ్యంలో జంతువులను, వేటాడడం, విలువైన సామాగ్రిగని దొంగిలించడంతో పాటు అటవీ శాఖాధికారులకు రక్షణ కరువు అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తిరిగి అటవీ శాఖాధికారులకు తుపాకులు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు. తుపాకులను ఉపయోగించుకొని సిబ్బంది ఇవ్వటం వలను రేంజ్ స్థాయి సిబ్బంది మరింత సమర్ధవంతంగా అడవులు మరింత సమర్ధవంతంగా అడవులు, వన్యప్రాణుల రక్షణ కొరకు పని చేయాలని ఆదేశించారు. తుపాకులు పొందిన వారిలో డిప్యూటీ రేంజ్ అధికారులు అరిఫ్ ఖాన్, ముక్కు.ప్రసాద రెడ్డి, రామ్మోహన్ రావు, సెక్షన్ అధికారులు చెన్నయ్య, శ్రీను, అటవీ బీటు అధికారులు వెంకటేశ్వర్లు, భాను ప్రసాద్, రోశయ్య, గురవయ్య, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.



తుపాకులతో అటవీశాఖ సిబ్బంది

పింఛన్‌దారులకు దొరకని పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవలే వితంతు పింఛన్లు కూడా పోయాయి. వెయ్యి చదరపు అడుగుల్లో ఇల్లు ఉందనే కారణంతో అనేక మందికి తొలగించారు. వీళ్లు కూడా తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. వితంతువుగా ఉన్నా దాన్ని కూడా పరిగణలోకి తీసుకోలేదు. వాస్తవానికి వితంతు పింఛను ఇవ్వడానికి కారణం భర్త లేడనే.. పింఛనుకు అర్హత కూడా ఇదే. అయితే తొలగించే సమయంలో అర్హతకు ప్రామాణికం లేని ఇంటిని ఎలా పరిగణలోకి తీసుకున్నారనేదీ గందరగోళంగా మారింది. ఇప్పుడు వితంతు పింఛనుదారులకు రెండు, మూడు నెలలుగా లబ్ధి ఆగిపోయింది. వీళ్లు కూడా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వీరికి కూడా పరిష్కారం దొరకలేదు. ఇక సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే వారికి జీతం ఎంతైనా ఐటీ లింకు ఉంది. పెద్ద పెద్ద వేతనాలు లేకపోయినా ఇది తప్పదు. చదువుకునే సమయంలో పిల్లలు తల్లిదండ్రుల కార్డుల్లో ఉన్నారు. పిల్లలను ఐటీకి లింకు చేయడంతో తల్లిదండ్రులకు వచ్చే పథకాలు ఆగిపోయాయి. ఇంకా అమ్మఒడి, ఇతర పథకాలు అనేకం ఇలా ఐటీ లింకుతో పోయాయి. వాస్తవానికి చదువుల కోసం తీసుకునే రుణాలకు బ్యాంకులు విధిగా ఐటీ కట్టాలనే షరతు వల్లనే ఆదాయం లేకున్నా చాలా మంది ఐటీ కడుతున్నారు. మూడేళ్ల ఐటీ పత్రాలు చూపిస్తేనే బ్యాంకుల్లో రుణాలు ఇస్తారు. చాలా మంది ఆడిటర్లను సంప్రదించి ఎంతో కొంత కట్టినట్లు చూపుకుంటున్నారు. ఇది కూడా చాలా కుటుంబాల కొంపముంచింది. ఐటి కడుతున్నందున అన్నీ పోతున్నాయి. కంప్యూటర్లలో ఐటీ కడుతున్నట్లు నమోదు కాగానే అన్నీ మాయమైపోతున్నాయి. పాన్‌కార్డులు తప్పనిసరిగా అడుగుతున్నారు. ఇలా ఏదో రకంగా వడపోతలకు మార్గం ఎంచుకున్నారు. ఇచ్చేటప్పుడు ఉదారంగా ఇచ్చారు. ఆర్థికభారంతో ఇప్పుడు కోతలకు ఏ మార్గం దొరికితే దాన్ని ఎంచుకుటున్నారు. ఆరు నెలలుగా వృద్ధులకు పింఛన్లు ఆగిపోయాయి. ఒంగోలు పట్టణంలో ఆగిపోయిన వారికి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సొంతంగా ఇస్తున్నారు. ఈయన ఎంత కాలం ఇలా ఇస్తారనేదీ చర్చగా మారింది. ఎన్నికల తర్వాత పరిస్థితి ఏమిటనేదీ చూడాలి. బయట నియోజకవర్గాల్లో ఇలా ఇచ్చే నాథుడు కూడా లేడు. ఏదేమైనా పింఛన్ ఆగిపోయిన వృద్ధులకు తిరిగి ఇచ్చేలా నిబంధనలను సవరించాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో ఆప్షన్లను పునరుద్ధరించాలి.

ధాన్యం కొనుగోళ్లు అంతంతమాత్రమే..

(మొదటిపేజీ తరువాయి)

వరి పంటను ఆర్‌బికేల ద్వారా కొనుగోలు ఊసే లేకుండా పోయింది. రబీ సీజన్‌లో ఎక్కుగా జిల్లా లోని చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలో, కొంత మేర బాపట్లలో వరి సాగు జరుగుతుంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం రబీలో సుమారు 12 వేల హెక్టార్లలో వరి సాగు జరిగింది. ప్రస్తుతం యంత్రాల ద్వారా వరి కోతలు జరుగుతున్నాయి. కానీ ఎక్కడా కూడా ఆర్‌బికేల ధాన్యం కొనే ప్రయత్నాలు జరగలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఊసే లేదు. రైతులు కూడా గతంలో ఆర్‌బికేల ద్వారా అమ్మకాలు జరిపి తాము పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ వ్యాపారులకే తమ ధాన్యం తెగనమ్ముతున్నారు. రబీలో రైతులు బయట మార్కెట్‌లో డిమాండ్ ఉన్న బిపిటి వరి రకాలను సాగు చేసిన నేపథ్యంలో ధర కూడా మంచిగానే ఉంది. కల్లంలోనే వ్యాపారులు 75 కిలోల బస్తాకు రూ.1400 నుంచి 1500 వరకు చెల్లించి కొనుగోళ్లు జరుపుతున్నట్లు చెబుతున్నారు. గతేడాది స్వర్ణ, కారంచేడు, పర్చూరు ప్రాంత రైతులు మధ్య దళారుల మాట నమ్మి వారికి తమ ధాన్యం అమ్మి వారు నగదు చెల్లించక మోసపోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా ఈ ఏడాది రైతులు ధర తక్కువ అయినా సరే కల్లంలోనే ధాన్యం సొమ్ము ఇచ్చేలా మాట్లాడుకుని తక్షణ నగదు చెల్లింపులతో అమ్మకాలు జరుపుతున్నారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడమే కాకుండా ధాన్యం అమ్మకాల తాలూకు నగదు వెంటనే చెల్లించేలా చేయగలిగితే తమకు మేలు జరుగుతుందని, కాని ఆ పరిస్థితి లేనందున ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని తక్కువ ధరకే అమ్ముకోవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిర్చి రైతుకు నష్టాల మంట

(మొదటిపేజీ తరువాయి)

చేశామంటున్నారు. ఎకరాకు లక్షన్నర వరకు పెట్టు బడి పెట్టినట్లు చెబుతున్నారు.తీరా మూడో కోత కోసినప్పటికీ ఎకరాకు పది క్వింటాళ్ళకు మించి దిగుబడి రాలేదని రైతులు వాపోతున్నారు.

ఐదు ఎకరాల్లో మిరప తోటను సాగు చేశా

ఈ ఏడాది ఐదు ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. నల్లతామర సోకింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపు కాకపోవడంతో రెండెకరాల్లో పంట వదిలిపెట్టా. ఇప్పటి వరకు రూ.7.50 లక్షల పెట్టుబడి పెట్టా. మొదటి కోతలో 10 క్వింటాళ్ల తాలుకాయ (తెల్లకాయ) వచ్చింది. క్వింటాకు రూ.10 వేలు మాత్రమే ధర వచ్చింది. రెండో కోత కోసేసరికి ధర పతనమైంది. పెట్టుబడులు చేతికి రాని దుస్థితి ఏర్పడింది.నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.

మహాశివరాత్రి భక్తులకు రక్షణ చర్యలు: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలను దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం రక్షణపరమైన అన్ని చర్యలను ప్రతిష్టంగా చేపట్టామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మహ శివరాత్రి సందర్భంగా ఆలయాలకు వస్తున్న భక్తులకు రక్షణపరమైన భద్రత కోసం జిల్లా పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనటానికి అవకాశం ఉన్న ప్రధాన ఆలయాల వద్ద డిఎస్పి స్థాయి అధికారి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నూతన బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి శివరాత్రి బందోబస్తు అని జిల్లాలో ప్రధానంగా ఉన్న గోవాడ, చిన్నగంజాం పుణ్యక్షేత్రాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. కనుక ఎక్కువ మంది సిబ్బందితో ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశామన్నారు. డిఎస్పీ స్థాయి అధికారులను పర్యవేక్షణకు ఉంచినట్లు తెలిపారు. మిగిలిన ఆలయాల్లో కూడా వాటి యొక్క ప్రాధాన్యతను బట్టి సరిపడా సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. భక్తులు ఎవరికీ అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు, ప్రభల వద్ద, వ్యాపార సముదాయాల వద్ద దొంగతనాలు జరగకుండా సాధారణ దుస్తులలో పోలీస్ సిబ్బందిని ఎక్కువగా ఉపయోగించినట్లు తెలిపారు. మహిళలు, చిన్నపిల్లల భద్రత కోసం క్యూలైన్ల వద్ద మహిళా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు, ప్రధాన దేవాలయాల వద్ద అవుట్ పోస్ట్‌ను ఏర్పాటు చేసి భక్తులకు తగు సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ బందోబస్తుకు జిల్లాలోని అన్ని స్టేషన్ నుంచి పోలీస్ సిబ్బందిని, ఏఆర్ సిబ్బందిని, స్పెషల్ పార్టీ వారిని ఉపయోగించినట్లు తెలిపారు.





జిల్లాలోని అన్ని శివాలయాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా పోలీసు అధికారులు



గాయాలపాలైన వలస కూలీ ఈశ్వర్

ట్రాక్టర్ నుంచి జారిపడి వలస కూలీకి గాయాలు

ప్రజాశక్తి-కొండెపి

వలస కూలీ గాయాలపాలైన సంఘటన కొండెపి మండలం మిట్టపాలెం గ్రామ మలుపు దగ్గర చోటు చేసుకుంది. కూలీ చెప్పిన వివరాల ప్రకారం కర్నూలు జిల్లా నుంచి కొండెపి మండలం పెట్లూరు గ్రామానికి మిరప కోతలకు 25 మంది కూలీలు వచ్చి జీవనం సాగిస్తున్నామని అన్నారు. శనివారం శివరాత్రి పండుగ సందర్భంగా కూలీలు అందరూ మడనూరు సముద్ర స్నానానికి వెళ్లి తిరిగి వస్తుండగా కొండెపి మండలం మిట్టపాలెం గ్రామ మలుపు దగ్గరకు వచ్చేసరికి ట్రాక్టర్ నుంచి 15 సంవత్సరాల గల ఈశ్వర్ అనే బాలుడు జారిపడడం జరిగిందన్నారు. జారిపడిన ఈశ్వర్ కాలుకు తీవ్రగాయాలు అవడంతో కొండెపి ప్రభుత్వ ఆసుపత్రికి ట్రాక్టర్‌లో తీసుకొని వచ్చారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన వైద్యులు ఈశ్వర్‌కు కాలు విరిగినట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



నిలిచిన స్త్రీశక్తి భవన నిర్మాణం

స్త్రీ శక్తి భవన నిర్మాణ లక్ష్యం నెరవేరేనా?

నేటికి అద్దె భవనాల్లో ఇబ్బంది పడుతున్న సిబ్బంది, పొదుపు మహిళలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం


యర్రగొండపాలెం నియోజకవర్గంలో నేటికి స్త్రీ శక్తి భవనాల నిర్మాణ లక్ష్యం నెరవేరడం లేదు. కొన్ని నిర్మించినా ప్రారంభానికి నోచుకోక పోవడంతో సిబ్బంది, పొదుపు మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో నిర్మాణంలో ఉన్న ఏ ఒక్క భవనాలను పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భవనాలు అందుబాటులో లేకపోవడంతో అద్దె భవనాల్లో అవస్థలు పడుతున్నామని సంబంధిత సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న భవనం 2011లో ఉపాధిహామీ నిధులు రూ.25 లక్షలతో అప్పటి మున్సిపల్ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పునాది తీసి నిలిపివేశారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక 2015లో టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ మన్నె రవీంద్ర ఆ భవనానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. 2019లో స్లాబ్ భవనంలో ప్లాస్టింగ్ పనులు పూర్తి చేశారు. పై అంతస్తు నిర్మాణం జరిగినప్పటికీ లోపల కాంక్రీట్ పనులు, ఫ్లోరింగ్ పూర్తి చేయలేదు. దీంతో భవనం నాలుగేళ్లుగా ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. అక్కడ మందు బాబులు అగడాలు ఎక్కువయ్యాయి. పొదుపు గ్రూపులకు సొంత భవనం లేక అద్దె భవనాల్లో ఉంటూ ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న ఆ భవనంలో సిమెంట్ నిల్వలు చేసుకుంటున్నారు. వెంటనే నియోజకవర్గంలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న భవనాలు పూర్తి చేసి మండల సమాఖ్యలకు అప్పగించాలని పొదుపు సంఘాల మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-పర్చూరు: తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అనపర్తిలో జరిగిన పర్యటనను అడ్డుకున్నందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి సైకో ప్రభుత్వం అంటూ నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు పర్యటన అడ్డుకోవటం ప్రజాస్వామ్య విలువలను నీరుగార్చటమేనన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఏవి కృష్ణ, మక్కెన శేఖర్‌బాబు, ధూళిపల్లి వెంకటస్వామి, షేక్ హుస్సేన్, తులసి శ్రీనివాసరావు, కిరణ్, కె శివ, అప్పలనేని నరేంద్ర, ఎంపిటిసి సభ్యులు కాపు రవిచంద్ర, గోరంట్ల రామకృష్ణ, ఖాజా వలి, అప్పలనేని వెంకట్, సమీర్, బుల్లా మేస్త్రి, గౌస్, బహీర్, జాని తదితరులు పాల్గొన్నారు.



బోడవాడలో స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలూరి

కన్నుల పండువగా కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం బోడవాడలోని గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి భజన మందిరంలో శివరాత్రి సందర్భంగా బ్రహ్మంగారి శాంతి కళ్యాణోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వామివారిని సందర్శించుకొని కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది. కళ్యాణోత్సవంలో రాష్ట్ర బిసి సంఘం నాయకులు కొడూరి శేషబ్రహ్మాచారి, ఆలయ కమిటీ ప్రతినిధులు కొడూరి సుబ్రహ్మణ్యాచారి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, నాగేశ్వరరావు, శివనాగేశ్వరరావు, టి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఏసీఏ ప్రతినిధులు


సేవలో ముందుంటాం: ఏసీఏ

ప్రజాశక్తి-చీరాల: పేదలకు సేవ చేసేందుకు ఆల్ కమ్యూనిటీ అసోసియేషన్ (ఏసిఏ) ఎల్లప్పుడూ ముందుంటుందని అసోసియేషన్ అధ్యక్షులు ఆకురాతి రేవంత్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఈడిగ ఎల్లమ్మ జ్ఞాపకార్థం కుమారులు రామకృష్ణ సహకారంతో ఏసీఏ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు చోట్ల నివసించే పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతలు, యువకుల సహకారంతో సేవా కార్యక్రమాలను చేస్తున్నట్లు చెప్పారు. శుభకార్యాలు, ఇతర ఫంక్షన్లలో మిగిలిన ఆహార పదార్థాలను వృథా చేయకుండా తమ చరవాణి 9948567418 నెంబరుకు తెలియజేయాలన్నారు. ఆయా ప్రాంతాలకు అసోసియేషన్ ప్రతినిధులు వచ్చి సేకరించి పేదలకు పంచుతామన్నారు. కార్యక్రమంలో వక్కలగం ఆనంద్, రాధిక, పలుమర్తి భాస్కర్, రాజేశ్వరి, కల్యాణి, నిర్మల, జగదీష్, పార్వతి, శ్రీనివాసరావు, శేషగిరి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివరాత్రి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రము భైరవకోన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాలు పెదరాజుపాలెంలోని సంగమేశ్వర ఆలయాలు శనివారం శివనామ స్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలను సందర్శించి తమ మొక్కుబడులు తీర్చుకొన్నారు. భైరవకోనలో భక్తులు ముందుగా జలపాతాన్ని వీక్షించి అక్కడ స్నానాలాచరించి అనంతరం త్రిముఖ దుర్గా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు కాలభైరవుడు శివలింగాలను దర్శించు కున్నారు భక్తుల సౌకర్యార్థం రెడ్డి యాదవ సామాజిక వర్గాల వారు అన్నదానం ఏర్పాటు చేశారు. చైర్మన్ సిద్దు రమణారెడ్డి భక్తులకు అన్ని ఏర్పాట్లు కల్పించారు. కనిగిరి ఉదయగిరి బద్వేల్ డిపోల నుంచి బస్ సర్వీస్‌లను నడిపారు. పోలీసులు పటిష్ట భద్రత కల్పించారు. మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ నారాయణరెడ్డి, చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. నారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులకు అన్నదానం కల్పించారు. భైరవకోన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన యాదవ్, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి, ఎంపిపి మూడమంచు వెంకటేశ్వర్లు, జెడ్పిటిసి మేకల శ్రీనివాసులు మండల వైసిపి అధ్యక్షులు బి వెంకటయ్య, వైస్ ఎంపిపి ప్రతాప్ రెడ్డి, పి వెంకటేశ్వర్ రెడ్డి, షేక్ బుజ్జి, పి మల్లికార్జున రెడ్డి, ముత్యాల భారతి నారాయణరెడ్డి, గంగసాని హుస్సేన్ రెడ్డి, స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



శివాలయంలో పూజలు చేస్తున్న సత్య

దామచర్ల సత్య పూజలు

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని నర్సింగోలు గ్రామంలో గంగా పార్వతి సమేత రామలింగేశ్వరాలయంలో, ప్రత్యేక లింగరూప శనీశ్వరాలయం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు డాక్టర్ జంధ్యాల చంద్రభాస్కరశాస్త్రి ఆధ్వర్యంలో శనివారం జరిగాయి. ఈ పూజలలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొని తిల తైలాభిషేకం, హోమాదాన కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి బత్తిన పూర్ణచంద్రరావు, కొమ్మాలపాటి కృష్ణ, రావి నాగేశ్వరరావు, పాతూరి కోటేశ్వరరావు, టిడిపి



రిబ్బన్ కట్ చేసి జెసిబిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

జెసిబిని ప్రారంభించిన ఎమ్మెల్యే కోన

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలానికి చెందిన కర్లపాలెం సచివాలయ కన్వీనర్ ఆట్ల నాగిరెడ్డి జెసిబి కొనుగోలు చేయగా ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ ఉపసభపతి, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి నివాసం వద్ద శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆట్ల నాగిరెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ దొంతుబోయిన సీతారామిరెడ్డి, అట్లా శ్రీనివాస్‌రెడ్డి, జై భారతరెడ్డి, బెనర్జీ, మార్పు రత్నం తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీలలో పాల్గొన్న బాలలు

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-రేపల్లె

చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యంలో బాలరక్షణ కమిటీ బాలల పంచాయతీ అధ్యక్షతన మండలంలోని పిరాట్లంక జడ్పీ హైస్కూలు ఆవరణలో కల్చరల్ అండ్ లిటరరీ కాంపిటేషన్ ఫర్ చిల్డ్రన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలకు లెమన్ అండ్ స్పూన్, పిరమిడ్ గ్లాసెస్, బకెట్ ఇన్ ది బాల్, ఐడెంటి ది నంబర్స్, బొమ్మలను గుర్తించటం తదితర ఆటల పోటీలు సూపర్ సబ్ జూనియర్, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ప్రోగ్రాం మేనేజర్ ఎన్ శ్రీనివాసరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సోమవారం యథావిధిగా స్పందన: డిఆర్ఒ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందన కార్యక్రమం సోమవారం యథావిధిగా కొనసాగుతుందని బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారిని కె లక్ష్మీశివజ్యోతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం ఉదయం 10:30 గంటలకు మొదలవుతుందని ఆమె తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



ఇంకొల్లులో ప్రసాదం పంపిణీ చేస్తున్న క్లబ్ నిర్వాహకులు

సేవా పథంలో ఇంకొల్లు వాసవీ క్లబ్

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

మహాశివరాత్రి సందర్భంగా ఇంకొల్లు శివాలయంలో ఇంకొల్లు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ప్రసాదం పంపిణీ చేశామని క్లబ్ నిర్వాహకులు వివరించారు. క్లబ్ అధ్యక్షుడు చిన్నిపూర్ణారావు, సెక్రటరీ దోగిపర్తి బదరీ నారాయణ, బైసాని నరసింహశెట్టి, దోగిపర్తి అయ్యప్ప, దోగిపర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే ఇంకొల్లులో మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు చిన్ని పూర్ణారావు వివరించారు.

జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి: జేసీ

లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు గృహ నిర్మాణాన్ని అందజేస్తుందని, జగనన్న గృహాలను ఆయా కాంట్రాక్టర్లు త్వరగా పూర్తి చేయాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ డి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని పలు జగనన్న కాలనీ లేఔట్లను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతంగా నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గృహ నిర్మాణాలలో లక్ష్యాలను సకాలంలో సాధించే విధంగా అధికారులు అందరూ సమన్వయంగా కృషి చేయాలని అన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంట్రాక్టర్లను, గృహనిర్మాణ లబ్ధిదారులను సమన్వయం చేస్తూ గృహాలను వేగవంతంగా నిర్మించాలని సూచనలు చేశారు. గృహ నిర్మాణాలకు సంబంధించి అన్ని వసతులను లబ్ధిదారులకు కల్పించాలని అన్నారు.



జగనన్న గృహాలు పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

రోడ్లు, ఇసుక, సిమెంటు, నీటి కొరత వంటి సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. కాలనీలో లబ్ధిదారులు నివాసం ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని అన్నారు. జగనన్న కాలనీలో రోడ్ల నిర్మాణం సమస్య ఉందని పలువురు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం కేటాయించిన నిర్ణీత గడువులోపే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని అన్నారు. గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఆర్డీవో సరోజిని, తహశీల్దారు ప్రభాకర్‌రావు, హౌసింగ్ డిఈ, ఏఈ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పిహెచ్‌సిలో పరిశీలన జరుపుతున్న డాక్టర్ ప్రియామాధవ్


పీహెచ్‌సిలో క్వాలిటీ స్టాండర్డ్ బృందం పరిశీలన

ప్రజాశక్తి-మద్దిపాడు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ బృందం శుక్ర, శనివారాలు పిహెచ్‌సిని క్షుణ్ణంగా పరిశీలించారు. జాతీయ స్థాయి నిబంధనల ప్రకారం వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయా? ఓపి విభాగం, ప్రసూతి, ల్యాబ్, ఇన్ పేషంట్ విభాగం, గ్రామాలలో ఆరోగ్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రం ఆదేశాల మేరకు పిహెచ్‌సిలో నాణ్యతతో కూడిన వైద్య సేవలు ప్రజలకు అందించాలని డాక్టర్ ప్రియా మాధవ్ కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు వినియోగంపై ఆరా తీశారు. పొరపాట్లు సరిదిద్దుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ ప్రియా మాధవన్‌కు డాక్టర్ డి మానస సిబ్బంది సన్మానం చేశారు. బృందంలో జిల్లా నుంచి కృష్ణప్రసాద్, మురళి, ఆనంద మోహన్ రావు, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



పి వైష్ణవి



వై ప్రణీత్



డి విష్ణు ప్రియ



కె వంశీకృష్ణ



జి రామ్ చరణ్

ప్రతిభాన్వేషణ పరీక్షల్లో విద్యార్థుల రాణింపు

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభాన్వేషణ పరీక్షల్లో బాపట్ల జిల్లాలో ఐదుగురు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు శనివారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో ఎడ్యుకేషన్ ఏపీఫని ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఈ యేడాది జనవరి 24న ఏడో తరగతి, పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు 5655 మంది, ఏడో తరగతి 7,064 మంది హాజరయ్యారు. ప్రిలిమ్స్ పరీక్షల్లో 50శాతం పైగా మార్కులు సాధించిన 344 ఏడో తరగతి, 518 పదో తరగతి విద్యార్థులకు గత నెల జనవరి 31న నిర్వహించిన మెయిన్ పరీక్షలకు హాజరయ్యారు. వారిలో19 మంది ఏడు, 26 మంది పదో తరగతి విద్యార్థులు పారితోషికం పొందేందుకు రాష్ట్ర స్థాయిలో అర్హత సాధించారు. వారిలో జిల్లాకు చెందిన పదో తరగతి విద్యార్థి పి వైష్ణవి (జడ్పీ హైస్కూల్, ఉల్లిపాలెం, నగరం మండలం), వై ప్రణీత్ (జడ్పీ హైస్కూల్ తిమ్మాయపాలెం అద్దంకి మండలం) డి విష్ణుప్రియ (జడ్పీ హైస్కూల్, పందిళ్లపల్లి, వేటపాలెం మండలం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. ఏడో తరగతి విభాగంలో కే వంశీకృష్ణ (జడ్పీ హైస్కూల్, చందలూరు, జే పంగులూరు మండలం) జి రామ్ చరణ్ (జడ్పీ హైస్కూల్, తిమ్మాయపాలెం, అద్దంకి మండలం) ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఈ నెలాఖరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నగదు పురస్కారం పంపిణీ చేస్తారని డీఈవో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా సైన్స్ అధికారి ఎండి సాదిక్, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గం

ఇది జగన్‌రెడ్డి ఫ్యూడల్ మనస్తత్వానికి నిదర్శనం: టిడిపి నేతలు

ప్రజాశక్తి-అద్దంకి

శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును అనపర్తిలో పర్యటనను అడ్డుకున్నందుకు నిరసిస్తూ పట్టణంలోని పోతురాజుగండిలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలు దేరి బస్టాండ్ మీదుగా బంగ్లారోడ్డులోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి తెదేపా నేతలు వినతిపత్రం శనివారం అంద జేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ పోలీసులు పర్యటనకు అనుమతి ఇచ్చి రెండు రోజులు సభలు విజయవంతం కావడంతో అడ్డుకోవడం అప్రజా స్వామికమని పేర్కొన్నారు. చంద్రబాబు రోడ్డుషోలో జన ప్రభంజనంతో జగన్‌రెడ్డి వెన్నులో వణుకు పుట్టిందని అన్నారు. చంద్రబాబు, లోకేష్ పర్యటనలతో తాడేపల్లి పునా దులు కదులుతున్నాయని, నిద్రలేని రాత్రులు గడుపుతు న్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయు డు పర్యటనను పోలీసులే అడ్డుకోవడం దుర్మార్గం. అనపర్తిలో చంద్రబాబు ప్రసగించకుండా పోలీసులను ఉపయోగించి బహిరంగ సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అనపర్తి సభకు జిల్లా పోలీసుల నుంచి అన్ని అను మతులు తీసుకున్నా అకారణంగా సభకు అనుమతులు లేవంటూ అడ్డుకోవడం అప్రజాస్వామికం. సంక్షేమ పథకాల పేరిట రూ.10 పంచిపెట్టి రూ.100 కొట్టేస్తున్న జగన్‌రెడ్డి



అద్దంకిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న టిడిపి శ్రేణులు

అసలు మోసాన్ని ప్రజలు గుర్తించారు. ఏదో ఒక పథకం పేరు చెప్పి ఉదయం బటన్ నొక్కి సాయంత్రం మద్యం విక్రయాల రూపంలో దోచుకుంటున్నాడు. దోపిడీ చేయడం తప్ప జగన్ ఏపీ ప్రజలకు చేసిందేమీ లేదు. చెత్తపై పన్ను వేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండి అని అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారు. వైసీపీ పాలనలో జనం విసుగు చెందారని. కాబట్టే సైకో పాలన పోవాలి. సైకిల్ పాలన రావాలని ప్రజలు కోరుకుం టున్నారని అన్నారు. సభకు ఉదయం అనుమతి ఇచ్చి సాయంత్రం రద్దు చేయటం ఏమిటని ప్రశ్నించారు. జగన్ చెప్పినట్టు విని కొందరు పోలీసులు వ్యవస్థకు చెడ్డపేరు తెస్తున్నాని అన్నారు. జగన్ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారం లోకి వచ్చి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని పూర్తిగా దుర్వినియోగం చేస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో జనం విసుగు చెందారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమని నేతలు ఉద్ఘాటించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రాక్షసత్వం ప్రదర్శిస్తున్న జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. దేశంలో ఎక్కడాలేని ఆంక్షలు ఈ రాష్ట్రంలోనే పెట్టడం జగన్‌రెడ్డి ఫ్యూడల్ మనస్తత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు సభకు ఉదయం అనుమతి ఇచ్చి సాయంత్రం రద్దు చేయడం దుర్మార్గమని అన్నారు. సైకో జగన్ చెప్పినట్లు విని పోలీస్ అధికారులు తమ వ్యవస్థకు చెడ్డపేరు తెచ్చుకుంటున్నారన్నారు. ప్రతిపక్ష నాయకుడి పర్యటనను అడ్డుకోవడం అప్రజాస్వామికం, నిజంగా దిగజారుడుతనమని ఇకనైనా పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల పట్టణ పార్టీ అధ్యక్షులు క్లస్టర్ ఇన్‌ఛార్జులు, తెలుగు మహిళా, తెలుగు యువత, ఎస్‌సి సెల్, సాంస్కృతిక, ఐటీడీపీ, బీసీ సెల్, మైనారిటీ, అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలు కిటకిట

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-చీమకుర్తి

శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని రామతీర్థంలోని మోక్షరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. శనివారం ఉదయం నుంచే ప్రజలు ఆలయం ఎదుట క్యూ కట్టారు. దాదాపు 20 వేల మంది ప్రజలు స్వామిని దర్శించుకున్నారు. మోక్షరామలింగేశస్వామి, గంగమ్మ ఆలయాలలో ప్రజలు పూజల్లో పాల్గొన్నారు. మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ వారు ఒంగోలు, పొదిలి నుంచి బస్సు సౌకర్యం కల్పించారు. వివిధ సామాజికవర్గాలకు చెందిన అన్నదాన సత్రాలలో ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమాలలో దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు గూడ రామ్మోహనరావు, గూడ చిదంబరశాస్త్రీ, ఆలయ ఇఒ భాస్కరరెడ్డి, చక్రవర్తి పాల్గొన్నారు.

మార్కాపురం: మహాశివరాత్రి వేడుకలు మార్కాపురం ప్రాంతంలో వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచే శైవ క్షేత్రాలు జనంతో పోటెత్తాయి. మార్కాపురం పట్టణంలోని శ్రీమార్కెండేశ్వర ఆలయంలో పట్టణ వాసులు ప్రత్యేక పూజల కోసం బారులు తీరారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి తొక్కిసలాట లేకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల



మార్కాపురంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ప్రత్యేక పూజలు



త్రిపురాంతకంలోని దేవాలయంలో మంత్రి సురేష్

చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ పి.కేశవరావులతో పాటు ధర్మకర్తలు సౌకర్యాలు కల్పించారు. మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెంలోని మునీశ్వరదేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అక్కడకి డివిజన్‌లోని వేలాది మంది జనం తరలివెళ్లారు. బండలాగుడు పోటీలు నిర్వహించారు. రాత్రివేళ్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

టంగుటూరు: జిల్లాలోనే ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటైన టంగుటూరు మండలం, జమ్ములపాలెంలో పంచముఖేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు భారీగా విచ్చేసి 1116 శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీకి తగినట్లుగా దేవస్థానం నిర్వాహకులు పాదర్తి బ్రహ్మయ్య, సిబ్బంది విశ్వరూపాచారి, మనోజ్ తదితరులు ఏర్పాట్లు చేశారు. ఐక్యత ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం. ఐక్యత వెల్ఫేర్ సొసైటీ ట్రస్ట్ అధ్యక్షులు ఎం రవి ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు పి రామారావు, పద్మజ, పున్నమ్మలు 1116 శివలింగాల దేవస్థానానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం సిబ్బంది, భక్తులు ఐక్యత ట్రస్ట్ నిర్వాహకులకు కతజ్ఞతలు తెలియజేశారు.

త్రిపురాంతకం: త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర స్వామి దేవాలయంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పూజలు నిర్వహించారు. అన్ని సంఘాల అన్నదాన సత్రాలను సందర్శించారు. అనంతరం దేవాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు పలు సూచనలు చేశారు.

కనిగిరి: శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని కనిగిరి పట్టణంలోని శివాలయాలతో పాటు మండలంలోని పునుగోడు సిద్ధేశ్వరాలయంలోని సిద్దేశ్వరస్వామి, నందనమారెళ్లలోని బాలకోటేశ్వరస్వామి ఆలయాలు పలు శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. స్వామి వారు, అమ్మవారులు ప్రత్యేక అలంకరణతో భక్తులకు ప్రత్యేక దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు నుదురుపాటి సుబ్బయ్య, వినుపాముల రామకృష్ణశర్మలు భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి పలు శైవక్షేత్రాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చీమకుర్తిలో అన్నదానం



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్ అనిల్, డాక్టర్ ప్రకాష్

'ఉపాస్' ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం, మూలగుంటపాడు పరిధిలోని దేవి సీఫుడ్స్ ఫ్యాక్టరీలో శనివారం ఒంగోలు, ఉపాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మంది కార్మికులకు బి.పి, షుగర్, గుండెకు ఈసీజీ పరీక్షలు చేశారు. శిబిరంలో ఊపిరితిత్తుల వైద్యనిపుణులు కె.అనిల్ కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ కె.జ్యోత్స్న, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ జి.శ్రీనివాసులు కార్మికులకు వైద్య పరీక్షలు చేసి.. మందులు ఉచితంగా అందజేశారని ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చవల తెలిపారు. శిబిరంలో దేవి సీఫుడ్స్ జిఎం మోహన్‌బాబు, ఉపాస్ ఎజిఎం కృష్ణ, పారా మెడికల్ సిబ్బంది, కార్పొరేట్ మార్కెటింగ్ మేనేజర్ రామకష్ణ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రఘువంశీ పాల్గొన్నారు.

విధ్వంసాలు సృష్టిస్తున్న వైసిపి ప్రభుత్వం

- పోలీసు వ్యవస్థను దిగజార్జిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి
- కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్రంలో విధ్వంసాలు సృష్టిస్తున్న ప్రభుత్వం వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం నాడు అనపర్తి బలభద్రపురంలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు కాన్వాయ్‌ను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ కొండపి మండల కేంద్రంలో ఎమ్మెల్యే స్వామి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. ఈ ర్యాలీ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి జెండాచెట్టు మీదుగా ఎన్టీఆర్ కూడలి వరకు నిర్వహించారు. ఎన్టీఆర్ కూడలిలో ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎటువంటి ఇబ్బందులూ పెట్టలేదని అన్నారు. ప్రభుత్వం టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్‌బాబు చేస్తున్న పాదయాత్రలో ప్రతి అడుగడుగునా ఇబ్బందులు పాల్జేస్తున్నారని అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పెట్టిన ప్రతి మీటింగ్‌లో ఇబ్బందులు పెట్టడం మనం చూస్తున్నామని, టిడిపి మీటింగ్‌లను, పాదయాత్రలలో జన సముద్రాన్ని చూసి జగన్మోహన్‌రెడ్డికి భయం పుడుతోందని పేర్కొన్నారు. దాని కారణంగా ఇలాంటి ఆటంకాలు సృష్టిస్తున్నారని అన్నారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా కార్యకర్తల బలం టిడిపికి ఉందని, త్వరలో దుర్మార్గపు పాలనకు స్వస్తి చెప్పి రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొని రావడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి పోలీసు వ్యవస్థను దిగజార్జాడని అన్నారు. ఎన్ని కేసులు, అడ్డంకులు పెట్టినా కార్యకర్తల అభిమానం ఉన్నంత వరకు ఎటువంటి కార్యక్రమం ఆగదని అన్నారు. కొండపి మండలం మిట్టపాలెం గ్రామానికి చెందిన రాష్ట్ర తెలుగు యువత ఐనంపూడి రమేష్‌ను 48 గంటల పాటు పోలీసులు అదుపులోకి తీసుకున్నా కూడా దాని తర్వాత మరలా ఆయన లోకేష్ పాదయాత్రలో పాల్గొన్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి.రామయ్య చౌదరి, రాష్ట్ర వాణిజ్య విభాగం నాయకులు ఆర్.మధుసూదనరావు, మండల పార్టీ అధ్యక్షులు బి.యలమందనాయుడు, నారాయణస్వామి, నరసారెడ్డి, నాయకులు ఎన్.సుబ్బరామయ్య, బి.సోమయ్య, బొద్దులూరి మోహన్‌రావు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు.. చేతికి సంకెళ్లు..

కనిగిరి: చంద్రబాబు పర్యటనకు ఆటంకం కలిగించటాన్ని వ్యతిరేకిస్తూ కనిగిరి పట్టణంలో టిడిపి శ్రేణులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన ర్యాలీ చేపట్టారు. చేతులకు సంకెళు కట్టుకొని విన్నూత్న నిరసన తెలియజేశారు. సైకో జగన్ పాలన పోవాలి, సైకిల్ పాలన రావాలంటూ నినాదాలు చేశారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాచమళ్ల శ్రీనివాసరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, షేక్ ఫిరోజ్, ముచ్చుమారి చెంచిరెడ్డి, చింతలపూడి తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.



శింగరాయకొండలో నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య

శింగరాయకొండ: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం నాడు శింగరాయకొండలో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమానికి హాజరైన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని, యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్‌ను పోలీసులు, ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్న నేపథ్యంలో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో కందుకూరు నుంచి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు నల్ల జెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అక్కడే మానవహారం నిర్వహించారు. కొండపిశాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఈ సైకో ముఖ్యమంత్రి అమలు చేయడం లేదన్నారు. పోలీసులు రోడ్లకు అడ్డంగా కూర్చొని బస్సులు పెట్టి.. లారీలు పెట్టి తెలుగుదేశం కార్యక్రమాలను అడ్డుకుంటున్నారన్నారు. ఇంత నీచమైన పాలన ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. దామచర్ల సత్య మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడిని అనపర్తిలో పోలీసులు పెట్టిన ఇబ్బందులు అంతా ఇంతా కాదని, చాలా దారుణమని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక సైకోలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కొండేపి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు చురుగ్గా పనిచేసి.. తెలుగుదేశం పార్టీ గెలుపునకు కషి చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ, కూనపురెడ్డి వెంకట సుబ్బారావు, సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, ఇమ్మడిశెట్టి రామారావు, మించల బ్రహ్మయ్య, షేక్ సనావుల్లా, షేక్ ఎస్దాని, షేక్ అబ్దుల్ సుబాహాన్, పులి ప్రసాద్, పులి మాలకొండయ్య, కన్నా శ్యాంప్రసాద్, గనపినేని రవి చౌదరి, శీలం సుబ్రహ్మణ్యం, సుదర్శి చంటి, గుదే వెంకటేశ్వర్లు, వేల్పుల వెంకటరావు , పసుపులేటి శేషు, బైరపనేని మోహన్‌రావు పాల్గొన్నారు.

పామూరు: టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కార్యక్రమాలను పోలీసులు అడ్డుకోవడం దురదృష్టకరమని టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ జడ్‌పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి ఆరోపించారు. టిడిపి ఆద్వర్యంలో శనివారం హైస్కూల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలకు మాట్లాడే హక్కు స్వేచ్చను లేకుండా చేస్తున్నారని అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని వైసిపి వ్యతిరేకిస్తుందని ఆరోపించారు. ఇలా దుర్మార్గానికి పాల్పడితే ప్రజలే బుద్ధి చెప్పుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో షేక్ రహంతుల్లా, ఎస్‌డి అమీర్‌బాబు, ఇరి కోటిరెడ్డి, మాల్యాద్రి, వీరబాబు, మౌలాలి, మోషే, సుబ్బారావు, రామాంజి, హరి, మహేష్, రమాదేవి, ప్రసాద్‌రెడ్డి, గుంటుపల్లి శ్రీను, హుస్సేన్‌రావు యాదవ్, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చంద్రబాబును పోలీసులు అడ్డుకోవడం

దుర్మార్గపు పాలనకు పరాకాష్ట

అంబేద్కర్ విగ్రహానికి అర్జీ ఇచ్చిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

తూర్పుగోదావరి జిల్లా, అనపర్తిలో శుక్రవారం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుని పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గపు పాలనకు పరాకాష్ట అని తెలుగుదేశం పార్టీ నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి అన్నారు. పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో హనుమంతునిపాడు మండల కేంద్రంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి.. నిరసన తెలియజేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడమని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ బొమ్మ వరకు నల్ల బ్యాడ్జీలతో ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో తాటి రెడ్డి పిచ్చిరెడ్డి, మండల నాయకులు మురహరి నర్సయ్య, కందుల వెంకటసుబ్బారెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, కూడలి దశరథ, తాటి రెడ్డి వీరనారాయణరెడ్డి, ధారా నారాయణ, దుగ్గెంపూడి అంకిరెడ్డి, కొప్పుల బాల, గంట పెద్దిరెడ్డి, గాయం చెన్నారెడ్డి, బాల గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు: పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారని గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆరోపించారు. చంద్రబాబు రోడ్డు షోని పోలీసులు అడ్డుకోవడాన్ని ఖండించారు. ఇందుకు ఖచ్చితంగా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

పొదిలి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గారి పర్యటనను పోలీసులే అడ్డుకోవడం దుర్మార్గం అని తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్.రసూల్ ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో జనం విసుగు చెందారని రాబోయే కాలంలో ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



రామచంద్ర యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

'బీసీల ఆత్మగౌరవ సభకు వస్తా..'

ప్రజాశక్తి -పొదిలి

మార్చిలో పొదిలిలో జరిగే బీసీల ఆత్మగౌరవ సభకు వస్తానని చిత్తూరు జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త రామచంద్రయాదవ్ అన్నారు. శనివారం పొదిలి పట్టణంలోని శివాలయాన్ని సందర్శించి పార్వతి సమేత నిర్మమహేశర స్వామిని శనివారం దర్శించుకున్నారు. గిద్దలూరు నుంచి విజయవాడ వెళ్తు మార్గం మధ్యలో స్థానిక పొదిలి చెందిన అఖిల భారత యాదవ మహాసభ నాయకులు ఆహ్వానం మేరకు స్థానిక శివాలయం చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదవ మహాసభ నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలలో పొదిలిలో జరిగే బిసిల ఆత్మ గౌరవ సభకు హాజరు కానున్నాట్లు తెలిపారు. కార్యక్రమంలో యాదవ మహాసభ నాయకులు మందగిరి వెంకటేష్ యాదవ్, మూరబోయిన బాబురావు యాదవ్, కనకం వెంకట్రావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల ఎస్సీ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తారని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం నాడు కళాశాల బాలికల హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. హాస్టల్ విద్యార్థినుల తో సమావేశమయ్యారు. హాస్టల్ విద్యార్థులు మాట్లాడుతూ సమయం దొరికినప్పుడు భోజనం పెడుతున్నారని, మిగతా సమయంలో భోజనం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇక్కడ వార్డెన్, కుక్ మధ్య తగాదాల కారణంగా తాము అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవటం లేదన్నారు. హాస్టల్లో ఉండలేకపోతున్నామని, భయమేస్తోందని వివరించారు. హాస్టల్ భవనంతో పాటు హాస్టల్లో ఉన్న సమస్యలను శాసనసభ్యులు స్వామికి విద్యార్థినులు వివరించారు. పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా ఉన్నతాధికారులకు లేఖ రాశానని, అతి త్వరలోనే మీ సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యార్థులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తమను ఈ హాస్టల్ నుంచి మంచి హాస్టల్‌కు పంపేలా కషి చేయాలని విద్యార్థులు కోరారు. పరీక్షల సమయంలో ఇలాంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. హాస్టల్ బాగుంటే ఎక్కువమంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందని వివరించారు. 'విద్యార్థుల్లో రాజకీయాలు ఉంటాయా సార్.. పసుపు గుడ్డలు వేసుకుంటే వార్డెన్ ఇబ్బంది పెడతోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ్యులు స్వామి హాస్టల్‌కి వెళితే అక్కడే ఉన్న వార్డెన్ జగదీశ్వరి ఎమ్మెల్యే వచ్చారని తెలిసినా.. రూమ్‌లో నుంచి బయటకు రాకపోవడం విశేషం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ హాస్టల్ బాగుండాలంటే వార్డెన్ కీలకపాత్ర పోషించాలని, ఇలాంటి వార్డెన్ ఉండటంవల్ల ఎస్సీ బాలికల హాస్టల్‌కి ప్రమాదమని అన్నారు. ఎమ్మెల్యే వెంట చీమకుర్తి కష్ణ, మించల బ్రహ్మయ్య, సుదర్శి ప్రసాద్‌రావు, వేల్పుల సురేష్, కల్లగుంట నరసింహ, కనిగిరి వెంకటేశ్వర్లు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

పోటెత్తిన భక్తులు

దోర్నాలలో మహాశివరాత్రి సందడి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం భక్తులతో దోర్నాల పట్టణం పోటెత్తింది. వాహనాలతో రహదారులు రద్దీగా మారాయి. భక్తులకు ఇస్కాన్ సంస్థ, బలిజ సంఘం, వాల్మీకీ సంఘం, తానచింతల గ్రామం, చీమకుర్తి, రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దోర్నాల సర్పంచ్ చిత్తూరి హారిక అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దోర్నాల మేజర్ పంచాయితీ ఆధ్వర్యంలో ఎలాంటి అపరిశుభ్రత లేకుండా పారిశుధ్య కార్మికుల చేత ఎప్పటికప్పుడు శుభ్రం చేయించారు. నటరాజ సెంటర్ విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. సబ్ కలెక్టర్ దోర్నాల పట్టణాన్ని సందర్శించి భక్తులకు అందుతున్న సౌకర్యాలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. మార్కాపురం డిఎస్పీ కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో నలుగురు సిఐలు, పది మంది ఎస్ఐలు, 160 మంది పోలీసులు శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నియంత్రించారు.



దోర్నాల మీదుగా శ్రీశైలంకు వెళుతున్న వాహనాలు

యర్రగొండపాలెం: మహా శివరాత్రి పండుగ సంధర్భంగా యర్రగొండపాలెం పట్టణంలోని శివాలయంతో పాటు మండంలోని పలు గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. యర్రగొండపాలెం పట్టణం నుంచి ఎక్కువ సంఖ్యలో శ్రీశైలం, త్రిపురాంతకం, కోటప్పకొండ ఆలయాలకు భక్తులు తరలి వెళ్లారు.

దొనకొండ: మండలంలోని చందవరం, గంగదేవిపల్లి, పెద్దగుడిపాడు, ఇండ్లచెరువు గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి పండగను ఘనంగా నిర్వహించారు. పెద్దగుడిపాడులోని శివాలయంలో యరగొర్ల బసవయ్య, కె.రామారావు సతీసమేతంగా ప్రత్యేక పూజలు జరిపించారు. బసవయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి శిద్దా

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రంలో విశేష పూజల్లో రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మిపద్మావతి దంపతులు, యువపారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌కుమార్, శృతి దంపతులు పాల్గొన్నారు. శనివారం శివరాత్రి సంధర్భంగా శిద్దారాఘవరావు దంపతుల ఆధ్వర్యంలో యగ్నం నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో శిద్దా ఆరాధ్య, శిద్దావ్రిష్ పాల్గొన్నారు.

కొండపి: కొండపి మండలంలో అన్ని గ్రామాలలో మహాశివరాత్రి పండుగను వైభవంగా జరుపుకున్నారు. కె. ఉప్పలపాడు, పెదకండ్లగుంట తదితర గ్రామాలలో ఉన్న శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముండ్లమూరు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పులిపాడు, ఉల్లగల్లు, పసుపుగల్లు, ముండ్లమూరు, పోలవరం, మారెళ్ల, యుఎంపురం, ఈదర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు ఉదయాన్నే పూజలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు ఆలయాల్లో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా రాత్రులు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



చీమకుర్తిలో ప్రత్యేకపూజల్లో శిద్దా కుటుంబసభ్యులు



బండలాగుడు పోటీలలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బండలాగుడు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన బండ లాగుడు పోటీల్లో గెలుపొందిన ఎడ్ల బండ్ల యజమానులకు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు శనివారం బహుమతులు అందజేశారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని ఆలయంలో అన్నా రాంబాబు, ఆయన సతీమణి దుర్గాకుమారి, కుమారుడు అన్నా కష్ణ చైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు పూర్ణ కుంభంతో ఎమ్మెల్యే అన్నా కుటుంబసభ్యులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే అన్నా, కుటుంబసభ్యులు అభిషేకాల వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్ర గురించి పుస్తకాన్ని రచించిన రచయిత అన్నపురెడ్డి వీరారెడ్డిని ఎమ్మెల్యే అన్నా ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ అభివద్ధికి సహకరించిన దాతలను ఎమ్మెల్యే అన్నా అభినందించి.. శాలువా, షీల్డ్‌లతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మొర్రి పిచ్చయ్యకు సన్మానం

ప్రజాశక్తి-గిద్దలూరు

ఇటీవల తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ లో స్థానం సంపాదించిన పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యా యులు డాక్టర్ మొర్రి పిచ్చయ్యను పుంగ నూరుకు చెందిన బోడె రామచంద్ర యాదవ్ ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ వత్తిలో ఉంటూనే తన వార్షిక వేతనంలో 20 శాతం డబ్బులను ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివద్ధి కోసం ఖర్చు పెట్టడం అభినందనీయం అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంను సందర్శించిన ఆయన మొర్రి పిచ్చయ్య యాదవ్‌ను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఓ వెంకటయ్య, పెట్టెల నారాయణ యాదవ్, యాదవ ప్రజా నాయకులు, యాదవ యువత పాల్గొన్నారు.



మంత్రికి సమస్యను వివరిస్తున్న కాలనీవాసులు

రోడ్డు సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ఎస్టీ కాలనీలోని నివసిస్తున్న దాదాపు 300 కుటుంబాలకి సరైన రోడ్డు మార్గం లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఆ కాలనీలో మిద్దె మీద నుంచి ఒక చిన్న బాబు పడితే ఆంబులెన్స్ కూడా రావడానికి మార్గం లేక ఆ బాబుని ఎత్తుకొని రోడ్డు పై దాకా కాలనీవాసులు తీసుకువెళ్లి అక్కడి నుండి హాస్పిటల్‌కి తీసుకువెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఒక ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగితే అగ్నిమాపక కేంద్రం బండి రావడానికి కూడా సరైన మార్గం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ కాలనీలో బడుగు బలహీన వర్గాల వారు నివసిస్తున్నారు. వారి సమస్యని రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కి పలుమార్లు వినుముంచుకున్నారు. ఆయన ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కానీ ఈ సమస్యను పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు శనివారం ఆ కాలనీవాసులు మంత్రి సురేష్‌ని కలిసేందుకు ఆయన గెస్ట్ హౌస్‌కి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. మా సమస్యను పరిష్కరించాలని కోరారు. మంత్రి సురేష్ మీ కాలనీకి వచ్చి మీ సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.

గృహ నిర్మాణాలకు సహకరించండి

వార్డు సచివాలయ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ సూచన

ప్రజాశక్తి-బాపట్ల

జగనన్న కాలనీలో నిర్మాణ దశలో నిలిచిపోయిన లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించి గృహ నిర్మాణాలు పూర్తిచేయాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్ వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. శనివారం బాపట్ల మూలపాలెం, ప్యాడిసన్ పేట జగనన్న కాలనీల్లో వార్డు సిబ్బంది లబ్ధిదారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా భాను ప్రతాప్ మాట్లాడుతూ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ప్యాడిసన్ పేట, బేతనీ కాలనీ, మూలపాలెం జగనన్న లేఔట్లలో 3 వేల 5వందల మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసిన నివేశన స్థలాల్లో వెయ్యి గృహ నిర్మాణాలు పూర్తయి గృహ ప్రవేశాలు జరిగాయి. మరో 3 వందల


మాట్లాడుతున్న కమిషనర్..

గృహాలు బేస్‌మట్టం వరకే పరిమితమయ్యాయి. అధిక శాతం పునాది, బేస్ మట్టం వరకే ఉన్న గృహ నిర్మాణాలకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించి రానున్న ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో గృహ నిర్మాణాలు పూర్తయ్యే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్న కాలనీలో తాగునీరు, రహదారుల నిర్మాణం పనులు వేగవంతం చేసేందుకు జాతీయ రహదారి 216 రోడ్డు విస్తరణలో భాగంగా త్రవ్వకాల్లో తొలగించిన మట్టిని జగనన్న కాలనీల్లో రహదారుల నిర్మాణానికి వినియోగిస్తున్నట్లు అని తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనకు అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గృహ నిర్మాణాలు అవసరమైన నీరు, ఇసుక, సిమెంట్ వంటివి సకాలంలో లబ్ధిదారులకు ఎదురోకుండా చూడాలన్నారు. జగనన్న కాలనీలో పరిశీలించిన వారిలో మున్సిపల్ డిఈ శ్రీనివాసులు, వార్డు సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

అన్ని హంగులతో బస్టాండ్ నిర్మిస్తాం: మంత్రి

ప్రజాశకి-పెద్దదోర్నాల

దోర్నాలలో అన్ని హంగులతో ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. శనివారం రాత్రి దోర్నాల ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్అండ్‌బి స్థలంలో 51 సెంట్లను స్వాధీనం చేసుకొని అన్ని వసతులతో బస్టాండ్ నిర్మిస్తామని చెప్పారు. శ్రీశైలం వెళ్లే వాహనాలన్ని దోర్నాల వచ్చి వెళతాయని అందుచేత ఇక్కడ అన్ని సౌకర్యాలతో ఆర్టీసి బస్టాండ్ ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నిర్మాణం కోసం త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం ఆర్టీసీ డిఎం నరసింహులుతో రోజుకు ఎన్ని బస్సులు వెళతాయి, అవసరమైన వసతులు ఏంటనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి బస్సు బస్టాండ్‌కు వచ్చి పోయే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ చిత్తూరి హారిక, మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, గురువారెడ్డి, షేక్ మజీద్, గుమ్మా యల్లేష్, పవన్ కుమార్, వెంకటేశ్వరరెడ్డి వైసిపి నాయకులు పాల్గొన్నారు.


పేదలకు అల్పాహారం పంపిణీ చేస్తున్న సిఐ మల్లికార్జునరావు

'నేతాజీ' సేవలు అభినందనీయం: సిఐ

ప్రజాశక్తి-చీరాల

నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో సమితి ప్రతినిధులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఒకటో పట్టణ సిఐ మల్లికార్జునరావు అన్నారు. శనివారం నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు రిక్షా కార్మికులకు ఏర్పాటు చేసిన ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో నేతాజీ సేవా సమితిని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండి పేదలకు తమవంతు సాయం అందించినప్పుడే ఆత్మసంతృప్తి కలుగుతుందని, ఆ దిశగా అందరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముందుగా చిన్న రథం సెంటర్లో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు చుండూరు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి పవని భానుచంద్రమూర్తి, సత్యనారాయణ, హరిహరరావు, నాగేశ్వరరావు, నరేష్, అన్నమరాజు, సుబ్బారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అరవపల్లి బాలకోటయ్య తిరునాళ్ల

ప్రజాశక్తి-రేపల్లె

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, పువ్వులతో అలంకరించారు. లింగోద్భవ కాల సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, జగాజ్యోతి, మహానివేదన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులు తీరారు. యువత ప్రభలను కట్టి భక్తి శ్రద్ధలతో డప్పు వాయిద్యాల నడుమ ఆలయం వద్దకు చేరుకుని మొక్కుబడులు తీర్చుకునేందుకు ఉత్సాహాలు చూపించారు. మహిళా భక్తులు ఆలయ ఆవరణంలో పొంగళ్ళు పెట్టి స్వామికి నివేదించారు. అదేవిధంగా ఆలయ ఆవరణంలో వెలసిన గొల్లభామ పేరంటాళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రంగుల రాట్నం, బొమ్మల దుకాణాలు, తినుబండారాల దుకాణాలు జనంతో కిటకిటలాడాయి.


మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు


అరవపల్లిలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

తిరునాళ్లల్లో ప్రత్యేక సేవలు

విశ్వేశ్వరం, మోళ్లగుంట పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ తిరునాళ్లకు ప్రత్యేకంగా బస్సులను తిప్పారు. రేపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో, వేదగాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, అరుణశ్రీ దివ్యాంగుల సంక్షేమ సేవా సంఘం, పరిటాల యువసేన, రేపల్లె పురపాలక సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్రపొంగలి, తాగునీరు, మజ్జిగలను పంపిణీ చేశారు. వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

శనివారం మహాశివరాత్రి సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రూరల్ పోలీస్ సిఐ జి వేణు గోపాల్ రెడ్డి, ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చేశారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చినవారిలో ఇద్దరు కవల చిన్నారులు చూపరులను ఆకర్షించారు. ఆదివారం రథోత్సవం, సోమవారం జరిగే అన్నదాన కార్యక్రమంలో ప్రజలు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డరోడ్డు జంక్షన్‌లో అన్నదానం

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్‌లో ఉన్న కోటప్ప పాదం శిలా విగ్రహం వద్ద శనివారం మహాశివరాత్రి పండుగ సందర్భంగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ జంక్షన్‌లో వెలసిన కోటప్ప శిలాపాదం వంద సంవత్సరాల నుంచి, త్రికోటేశ్వర స్వామి పాదంగా భక్తులు ప్రతి ఏటా శివరాత్రి పర్వదినాన భక్తులు పూజిస్తుంటారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి సన్నెబోయిన గురుయాదవ్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు కోటప్పకొండకు వెళ్లే యాత్రికులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.


కోటిపల్లి శివాలయంలో అల్పాహారం అందజేస్తున్న వాసవీ సభ్యులు

భక్తులకు అల్పాహారం అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు మండల పరిధిలోని కోటిపల్లి గ్రామంలో గల దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని వెల్లటూరు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. క్లబ్ రీజనల్ చైర్మన్ సిహెచ్ రామ్మోహనరావు చేతుల మీదుగా అందజేశారు. క్లబ్ సారథ్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు క్లబ్ అధ్యక్షులు నాగళ్ల ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నంబూరు నాగభూషణం, కోశాధికారి నంబూరు ప్రసాద్, నంబూరు తేజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి-చీరాల

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చీరాల పట్టణంలో పలు శివాలయాలతో శనివారం ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. చీరాల శివాలయంలో తెల్లవారు జామున నుంచే భక్తులు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమాన్ని కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు. అదేవిధంగా పేరాల దేవాలయంలో ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృత వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. దేవతామూర్తులను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కొత్తపేట ఒంకార క్షేత్రంలో, వరసిద్ధి వినాయక పార్వతీ నాగలింగేశ్వరస్వామి దేవస్థానాలలో విశేష పూజలను అర్చకస్వాములు నిర్వహించారు.

గృహ నిర్మాణ సామగ్రికి రెక్కలు

సింగిల్ బెడ్ రూం ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు అదనపు భారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పశ్చిమ ప్రాంతంలో గృహ నిర్మాణ సామగ్రికి రెక్కలు రావడంతో నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో జగనన్న పక్కా గృహాలు కాక సుమారు మూడు వేల గృహాలు సొంత నిధులతో నిర్మించుకునేవి నిర్మాణంలో ఉన్నాయి. అయితే నెల రోజులుగా సిమెంటు, స్టీల్ ధరలు అంతకంతకూ పెరగడమే కారణమని బిల్డర్లు చెబుతున్నారు. కరోనా వల్ల సగానికి పైగా పతనమైన వ్యాపారాలు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న తరుణంలో ధరల పెంపుతో నిర్మాణాలు కుదేలై వ్యాపారాలు కూడా తగ్గిపోతున్నాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరల వల్ల ఆరు నెలలు క్రితంతో పోలిస్తే సింగిల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణానికి రూ.3 నుంచి రూ. 4 లక్షలు అదనపు భారం పెరిగిందని చెబుతున్నారు.

స్టీల్ టన్నుపై రూ.5 వేల పెంపు..

స్టీల్ ధరలు వారంలో టన్నుపై రూ.5 నుంచి 6 వేలు పెరిగింది. ప్రముఖ కంపెనీల గ్రేడ్-1 రకం స్టీల్ వారం క్రితం టన్ను రూ.73 వేలు ఉంటే తాజాగా రూ.78 వేలకు చేరింది. టన్నుపై రూ.5 వేలు పెరిగింది. విశాఖ స్టీల్ రూ.65 వేల నుంచి రూ.71 వేలకు చేరింది. అంటే రూ.6 వేలు పెరిగింది. సాధారణ కంపెనీలకు చెందిన గ్రేడ్-2 రకం స్టీల్ రూ.56 వేల నుంచి రూ.61 వేలకు చేరింది. టన్నుపై రూ.5 వేలు పెరిగింది. డబుల్ బెడ్‌రూం ఇంటికి 2.5 నుంచి 3 టన్నులు అవసరమని ఇంజనీర్లు అంటున్నారు. ఈ లెక్కన పెరిగిన ధరలతో పోలిస్తే రూ.15 వేలకు పైగా భారం తప్పడం లేదు. గతంలో ఇటుక రూ.6 ఉంటే తాజాగా నాణ్యతను బట్టి రూ.8-10పైమాటే. ఇసుక ట్రాక్టర్‌లో కొంటే టిప్పర్‌కు రూ.30 వేలకు పైగా పలుకుతుంది. పెట్రో ధరలు పెరగడంతో రవాణా ఖర్చులు పెరిగాయంటున్నారు. భవన నిర్మాణాలకు కావాల్సిన చెక్క సామాగ్రి, ఎలక్ట్రికల్, పెయింట్స్ (రంగులు), టైల్స్, గ్రానైట్ బండలు ఇలా అన్ని రకాల సామాగ్రి ధరలు పెరిగాయని వాపోతున్నారు.



నిర్మాణంలో ఉన్న ఇల్లు

సిమెంట్ బస్తాపై రూ.70 పెంపు..

ప్రముఖ బ్రాండెడ్ సిమెంట్ కంపెనీలు రెండు మూడు రోజులకు ఒకసారి ధరలు పెంచుతున్నాయి. కంపెనీల సేల్స్ మేనేజర్లు ధరలు పెరుగుతున్నట్లు నాలుగైదు రోజు ముందే మెసేజ్ పెట్టి.. ఆరోజు ధరలకే డిడిలు తీయమంటూ ఆదేశాలు ఇస్తున్నారు. ధర పెరుగుతుందని వడ్డీలకు అప్పులు చేసి డీలర్లు ఆర్డర్లు బుక్ చేస్తున్నట్లు ఒక వ్యాపారి తెలిపారు. ఈ వారం రోజుల్లో ప్రముఖ బ్రాండెడ్ కంపెనీలు మూడుసార్లు ధర పెంచారు. ఈ లెక్కన బస్తాపై రూ.70 వరకు పెరిగింది. డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టుకోవాలంటే 950 బస్తాలకు పైగా సిమెంట్ అవసరమని ఓ బిల్డర్ తెలిపారు. సొంతంగా ఇల్లు కట్టుకుంటే వెయ్యి బస్తాలకు పైగా అవసరం. ఈ లెక్కన కొత్త ఇల్లు కట్టుకునేవారికి వారం రోజుల్లోనే రూ.65 వేల నుంచి రూ.70 వేలు సిమెంట్ రూపంలో అదనపు భారం తప్పడం లేదు.

ధరలను నియంత్రించాలి

టంగుటూరి సత్యనారాయణ, సిపిఎం కార్యదర్శి, యర్రగొండపాలెం



గృహ నిర్మాణ సామాగ్రికి రోజురోజుకు ధరలు పెరుగుతుండటం తో చాలా ఇబ్బందిగా మారుతోంది. ధరలను నియంత్రించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో గృహ నిర్మాణ సామాగ్రి ధరలను ఇష్టానుసారంగా పెంచుతున్నారు. ధరలను నియంత్రించాలి.

వ్యకాస జాతీయ కౌన్సిల్‌కు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



కోల్‌కత్తాలో ఈ నెల 15 నుండి జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం 10వ జాతీయ మహాసభల్లో వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి జాతీయ కౌన్సిల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ మహాసభల చివరి రోజు జాతీయ కమిటీకి ఏ విజయ రాఘవన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 25 మందితో ఆఫీస్ బేరర్స్, 150 జనరల్ కౌన్సిల్ ఎన్నికైందన్నారు. మహాసభల్లో గత మూడు సంవత్సరాలుగా నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలను సమీక్షించి, భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుట జరిగిందన్నారు. దేశంలో వ్యవసాయ రంగ సంక్షోభం, నిర్వీర్యం అవుతున్న గ్రామీణ ఉపాధి హామీ, భూమి వేతనాలు, పేదలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు, సామాజిక న్యాయం సాధన కోసం జరగాల్సిన ఉద్యమాలు, దళితులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా చేపట్టబోయే ఉద్యమాలను సమగ్రంగా చర్చించి ప్రణాళిక జరిగిందన్నారు. ఈ మహాసభల్లో ప్రకాశం జిల్లా నుండి నెరుసుల వెంకటేశ్వర్లు, ఊసా వెంకటేశ్వర్లు ప్రతినిధులుగా పాల్గొన్నారు.

ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని

విధుల నుండి తొలగించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికల దుర్వినియోగానికి పాల్పడిన ఆర్జేడీ ప్రతాపరెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, సిహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్‌గా ఉన్న ప్రతాపరెడ్డిని ఆగమేఘాలపై ఎన్నికల కోసమే కడప ఇంఛార్జి ఆర్జేడీగా నియమించారని వాపోయారు. అధికారాలు చేపట్టిన నాటి నుండి అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ అభ్యర్థులు గెలుపు కోసం ప్రచారానికి దిగడం సిగ్గుచేటన్నారు. ప్రతాప్‌రెడ్డి విద్యాశాఖ అధికారా, లేక వైసిపి నాయకుడా అని ప్రశ్నించారు. ఆర్‌జెడి ప్రతాపరెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకొని సర్వీసు నుంచి తొలగించాలి వారు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్, పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి పాఠశాల పర్యవేక్షణ పేరుతో వెళ్లి తనిఖీలు చేయడం, ఉపాధ్యాయుల్ని భయ భ్రాంతులకు గురి చేయడం సరైంది కాదన్నారు. తక్షణమే విద్యాసంస్థల తనిఖీలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ నాయకులపై హత్యాయత్నం కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అనంతపురం ఆర్డిటి సంస్థ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ఆర్‌జెడి డైరెక్టర్ ప్రతాపరెడ్డిని ఎన్నికల నిబంధనలను బేఖాతరు చేసి విందు సమావేశం ఏర్పాటు చేయడమేంటంటూ నిలదీసిన ఎస్ఎఫ్ఐ నాయకులు తనపై దాడి చేసేందుకు వచ్చారంటూ నాయకులపై ఎదురుదాడికి దిగి వారిపై అక్రమ కేసు బనాయించడం సిగ్గుచేటన్నారు. వెంటనే పెట్టిన తప్పుడు కేసును వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కోవిడ్ సమయంలో విధుల్లో చేరి నగరపాలక సంస్థలో సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శ్రీరామ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగర పాలక సంస్థలో 2019లో కోవిడ్ సమయంలో విధులు నిర్వహించేందుకు కొంతమంది కార్మికులను పనిలోకి తీసుకోవడం జరిగిందన్నారు. అప్పటి నుంచి వారిని కొనసాగిస్తున్నారని తెలిపారు. సరైన గుర్తింపు లేక, వేతనాలు సరిపోక వారు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే వారిని ఆప్కాస్‌లో చేర్చి, వారికి వేతన సవరణ చేసేలా ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదన వెళ్లేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గత మూడు మాసాలుగా కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పనిచేస్తూ చనిపోయిన కార్మికుల బదులు వారి కుటుంబసభ్యులను విధుల్లోకి తీసుకోవాలని, అన్ని పారిశుధ్య డివిజన్లలో అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యులకు పనిచేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి సురేష్ సొంత నిధులతో..

రోడ్డుప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన, గాయపడిన కుటుంబాలకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆర్థిక సహాయం అందజేశారు. యర్రగొండపాలెం మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన కూలీలు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా కొందరు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మంత్రి గ్రామానికి వెళ్లి ఆ కుటుంబాలను పరామర్శించారు. తాను సొంతంగా ఆర్థిక సహాయం అందిస్తానన్నారు. ఈ మేరకు శనివారం యర్రగొండపాలెంలో బాధితులకు నగదు అందజేశారు. మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ. 50 వేలు, తీవ్రంగా గాయపడిన ఇద్దరికీ రూ. 20 వేలు చొప్పున, స్వల్ప గాయాలైన ఇద్దరికీ రూ. 10 వేలు చొప్పున మొత్తం రూ. 1 లక్ష 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రామావత్ అరుణాబాయి, వైస్ ఎంపిపి ఆదిశేషు, వీరభద్రాపురం వైస్ సర్పంచ్ ముటుకూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సురేష్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మార్కాపురం

మండలంలోని తిప్పాయపాలెం గ్రామంలోని మునీశ్వర ఆలయం వద్ద మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురంలోని 'అరుణాచల ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' (ఎయిమ్స్) హాస్పిటల్ అధినేత డాక్టర్ పగడాల లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పలు నగరాల నుంచి స్పెషలిస్ట్ వైద్యులు ఈ శిబిరంలో పాల్గొని ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలందించారు. సుమారు 700 మందికి పైగా రోగులు హాజరయ్యారు. వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న డాక్టర్ పగడాల లక్ష్మిరెడ్డిని పలువురు అభినందించారు.



వైద్యసేవలందిస్తున్న డాక్టర్లు